క్లుప్తంగా

'పేట' వాసికి గవర్నర్ ప్రశంస



నారాయణపేట రూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ నారాయణపేట జిల్లా వాసిని అభినందించారు. పట్టణానికి చెందిన అడ్వకేట్ రఘువీర్‌యాదవ్ ఇప్పటి వరకు 59సార్లు రక్తదానం చేయడంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయనకు అవార్డును ప్రకటించారు. ఈ మేరకు గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమొంటోను అందుకున్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, సభ్యులు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

ధన్వాడ: పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పాఠశాలల్లో వేల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఫలితంగా విద్యాభివృద్ధి సాగడం లేదని వివరించారు. విద్యా సంవత్సరానికి సంబంధించి వలంటీర్లను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెంకట్రాములు, రాజు, తిమ్మరాజులు ఉన్నారు.

తాయమ్మవ్వ కట్ట నిర్మాణానికి పూజ



మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో గల తాయమ్మవ్వ ఆలయం కట్ట నిర్మాణానికి బుధవారం సర్పంచ్ రాజు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాయమవ్వ తల్లి గ్రామానికి ఏ కష్టం రాకుండా కాపాడుతుందన్నారు. పూర్వీకుల నుంచి పూజలు అందుకుంటున్న అమ్మవారి ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని, అందుకే ప్రత్యేకంగా అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. దీంతో పలువురు భక్తులు సర్పంచ్‌ను అభినందించారు. కార్యక్రమంలో భక్తులు చక్రపాణిరెడ్డి, నవీన్, భీమప్ప, అశోక్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీకు భవనాలు కేటాయించాలి



మక్తల్: పట్టణంలో గతేడాది నుంచి ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కాలేజీకు సొంత భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మక్తల్ డీటీ వాసుదేవరావుకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలో డిగ్రీ కాలేజీ ఉందని బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులను ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని సొంత భవనం కేటాయించడంతో పాటు వసతులు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్య, సహాయ కార్యదర్శి బాలు, అజయ్, సాయికుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

కిలో వెండి బహూకరణ

అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి కర్ణాటకలోని రాయచూర్ ప్రాంతానికి చెందిన సత్యారం రమేష్ కుమారుడు వినయ కృష్ణ, సత్యారం వేదాంగ్ కృష్ణ పేరుపై కిలో వెండి బుధవారం బహూకరించారు. ఈ మేరకు స్వామి వారు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు కిరీటాలు, కంఠాభరణము చేయించడానికి వెండి అందజేశారని నిర్వాహకులకు తెలిపారు. ఈ మేరకు దాతలను ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ అభినందించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



అడ్డాకుల: వాల్మీకి బోయలను ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలని మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎంబీ బాలకృష్ణ డిమాండ్ చేశారు. మూసాపేట మండల వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ మంజులను కలిసి వినతిపత్రం అందజేశారు. కులవృత్తి లేని తమకు కూడా రూ.లక్ష రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, అచ్చాయపల్లి సర్పంచ్ చంద్రశేఖర్, రవి ఉన్నారు.

వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట జనం పడిగాపులు
- బీసీలకు అందించే సాయం గడువు ముగుస్తుందని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం మూసివేయడంతో బయటే నిల్చున్న జనం

మద్దూరు: బీసీ కుల, చేతి వృత్తులు చేసుకునే వారికి రూ.లక్ష ఆర్థిక సాయం పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు సాంకేతిక సమస్య ఇబ్బందిగా మారుతోంది. అర్హులైన వారు మీసేవా కేంద్రాలకు వెళ్లి మొదటగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకోవడానికి కూడా వెబ్‌సైట్‌లో సర్వర్ డౌన్ అని వస్తుంది. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు దాదాపు 2 వేలకు పైగా ఉంటారు. ఈ దరఖాస్తులను జారీ చేయాలన్న వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఈ రోజు 20 దరఖాస్తులు కూడా చేయలేదని తెలుస్తోంది. దీంతో తహసీల్దార్ కార్యాలయాలనికి ఒక్కసారిగా జనం రావడంతో తలుపులు మూసి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను బుధవారం తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఇంకా 5 రోజులే మిగిలి ఉండడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని తహసీల్దార్ చింత రవితో మాట్లాడగా సాంకేతిక సమస్య కారణంగా సర్వర్ డౌన్ అయ్యింది. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారం అయిన వెంటనే అర్హులందరికీ కుల, ఆదాయ ధ్రువపత్రాలను అందజేస్తాం.

విధుల్లో ఒకరు.. బోర్డుపై మరొకరు!


సమాచారహక్కు చట్టం బోర్డుపై

నారాయణపేట రూరల్: సమాచారహక్కు చట్టం ప్రకారం ప్రతి కార్యాలయంలో అధికారుల పేరు, హోదా, సెల్ నంబర్‌తో బోర్డు ఏర్పాటు చేయాలి. అధికారులు ఎవరైనా బదిలీ అయితే వారి స్థానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పేరు కొత్తగా అందులో నమోదు చేయాలి. అయితే నారాయణపేట జిల్లా డీఈఓగా లియాకత్‌అలీ స్థానంలో రవీందర్ బాధ్యతలు స్వీకరించినా అప్పిలేట్ అధికారిగా ఆయన పేరు మార్చలేదు. అదేవిధంగా డీఈఓ చాంబర్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డుపైనా విధుల్లో ఉన్న రవీందర్ పేరు కాకుండా సెలవులో వెళ్లిన లియాకత్ అలీ పేరునే కొనసాగిస్తున్నారు. ఇక పౌర సమాచార అధికారిగా ఉన్న సూపరింటెండెంట్ నర్సింహులు బదిలీపై వెళ్లినా ఇప్పటికీ అదే పేరు ఉంది. దీంతో ఆ స్థానంలో ఎవరికి కేటాయించారో తెలియకుండా పోయింది. ఎంతో మందికి విద్యాబుద్ధులు చెప్పించే విద్యాశాఖ కార్యాలయంలోనే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అంటూ పలువురు మాట్లాడుకుంటున్నారు.

ఒండ్రుమట్టి అక్రమ తరలింపు అరికట్టాలి


కలెక్టరేట్‌లో ఏఓ నర్సింగ్‌రావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

నారాయణపేట: మక్తల్ నియోజకవర్గంలో అక్రమంగా ఒండ్రు మట్టిని తరలిస్తున్నారని, అరికట్టాలని కోరుతూ బుధవారం భారతీయ యువమోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏఓ నర్సింగ్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ మాట్లాడుతూ మక్తల్ పెద్ద చెరువు సర్వే నంబర్ 410, 412, 414, 416, 417లో కొందరు అక్రమార్కులు దాదాపు 300ల టిప్పర్లతో రోజు వేలాది ట్రిప్పుల ఒండ్రు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఈ నెల 2న కొందరు కేవలం 100 ట్రిప్పులకే మక్తల్ తహసీల్దార్ ద్వారా అనుమతి తీసుకొన్నారని, కానీ చెరువులో నుంచి రోజు వందల ట్రిప్పులు అక్రమంగా తరలిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. నియంత్రించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ ఊట్కూర్ మండల అధ్యక్షుడు రమేశ్, బీజేవైఎం నారాయణపేట టౌన్ అధ్యక్షుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి


ఊట్కూరులో సీపీఎస్ పాఠశాలలో పూజల్లో పాల్గొన్న ఎంపీపీ లక్ష్మి


మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..


దామరగిద్దలో..


అక్షరభ్యాసం చేయిస్తున్న సర్పంచ్

కోస్గి: గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, యువకులుతో పాటు అన్నీ వర్గాల ప్రజలు సమష్టిగా సహకరిస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతమవుతాయని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనంతప్ప సూచించారు. బుధవారం మీర్జాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భానుప్రకాష్‌తో కలిసి జీహెచ్‌ఎం అనంతప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యకుమార్, శిరీష, భవ్యశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాలలో బుధవారం సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 20 మంది విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ బాలమణి, ప్రధానోపాధ్యాయులు సునంద, ఉపాధ్యాయులు భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

దామరగిద్ద: మండలంలోని విఠలాపూర్ ప్రాథమిక పాఠశాలలో క్లస్టర్ హెచ్‌ఎం విశ్వనాథ్ సమక్షంలో బుధవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రావణి, అశ్విని అపర్ణ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని తీలేర్ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం సర్పంచ్ రేవతమ్మ, హెచ్‌ఎం అనూరాధలు విద్యార్థులకు అక్షరభ్యాసం నిర్వహించారు. పాఠశాలకు కొత్తగా వచ్చిన విద్యార్థులకు స్వాగతం పలికి వారికి కూడా అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వాలని ధర్నా

మహబూబ్‌నగర్ రూరల్: క్రిష్టియన్‌పల్లి శివారు 523 సర్వేనంబర్‌లో ఇళ్ల పట్టాలు కలిగిన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి మాకం రాంమ్మోహన్ మాట్లాడుతూ క్రిష్టియన్‌పల్లి శివారులో 20 ఏళ్ల క్రితం నిరుపేదల కోసం అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు అనువుగా లేకపోవడంతో ప్రజలు కట్టుకోలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేదలకు ఇచ్చిన స్థలాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిందని , ఇదేమిటని ప్రశ్నించిన స్థలాలు కలిగిన పేదలకు దివిటిపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న డబుల్ ఇళ్లను కేటాయిస్తామని అప్పట్లో చెప్పారని అన్నారు. తీరా దివిటిపల్లిలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక స్థలాలు కోల్పోయిన వారికి కాకుండా అధికారులు ఇతరులకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇకనైనా న్యాయం చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో మహిళా సమాఖ్య నాయకురాలు చెన్నమ్మ, పార్వతమ్మ, గోవిందమ్మ, కృష్ణవేణి, అరుణ, లలిత, పి.లక్ష్మమ్మ, మల్లేశ్వరీ, పద్మ, సవితదేవి, మంజుల, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్/భూత్పూర్ : క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కోసం కృషి చేయాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పలు మండలాలకు సంబంధించి మహిళా విభాగం నూతన అధ్యక్షులను నియమించారు. భూత్పూర్ మండల అధ్యక్షురాలిగా సరితారెడ్డి, భూత్పూర్ పట్టణ అధ్యక్షురాలిగా కె.పద్మ, చిన్నచింతకుంట మండల అధ్యక్షురాలిగా వరలక్ష్మి, దేవరకద్ర మండల అధ్యక్షురాలిగా ఎం.సుగుణలకు వసంత నియామకపత్రాలు అందజేశారు. నూతన అధ్యక్షులకు డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మండలం ఏర్పాటుతో విద్యారంగానికి మేలు

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరహారదీక్షలు 36వ రోజుకు చేరుకున్నాయి. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు బుధవారం దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు కాశీనాథ్ మాట్లాడుతూ.. మండల ఏర్పాటుతో భవిష్యత్‌లో ఇంటర్‌తో పాటు వివిధ విద్యాలయాలు వచ్చే అవకాశం ఉందని, దూరప్రాంతాలకు వెళ్లి చదువుకునే ప్రయాస లేకుండా పోతుందన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవ తీసుకుని కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజయ్, రాము, విజయలక్ష్మి, చెన్నప్ప, రాజు, వెంకట్రాములు, సౌజన్య, సుభాష్, మల్లేష్, నర్సింహులు పాల్గొన్నారు.

దళితులకు బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు


మాట్లాడుతున్న నాయకులు

దామరగిద్ద: బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులకు చేసిందేమి లేదని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు బి క్రిష్ణ అన్నారు. మండల అధ్యక్షుడు సత్యనారాయణ సమక్షంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితున్ని సీఎం చేస్తానన్న హామీ ఎమైందని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్ల వంటివి ప్రకటించి ఎంతమందికి ఇచ్చారో చెప్పాలన్నారు. మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని సన్మానించిన కొడంగల్ ఎమ్మెల్యే


ఎస్పీ వెంకటేశ్వర్లుతో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో బుధవారం కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి స్థానిక ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లును కలుసుకున్నారు. ఇటీవల విడుదలైన సివిల్స్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించిన ఉమాహారతిని కలుసుకునేందుకు వచ్చారు. తను డిల్లీలో శిక్షణలో ఉండటంతో ఆమె తండ్రి అయిన ఎస్పీని శాలువాతో సన్మానించి అభినందించారు. పిల్లల అభిష్టం మేరకు చదువుకునేందుకు ప్రోత్సహించడం, రాష్ట్ర కీర్తిని చాటినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట కోస్గి, మద్దూర్ మండల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ


శశికిరణ్


దేవరకొండ తరుణ్


కుర్వ అఖిల


సంగెపాగు నిఖిత


అరవింద్

ధన్వాడ: ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో ధన్వాడ మండలానికి చెందిన చిట్టెం శ్రీచరణి సత్తా చాటింది. 624 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 16,357 ర్యాంకు, ధన్వాడకు చెందిన నవితా సైతం 604 మార్కులతో 22 వేల ర్యాంకు సాధించింది.

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు నీట్‌లో ప్రతిభ కనబరిచారు. మండల కేంద్రానికి చెందిన మీనాక్షి 534 మార్కులతో ఆల్‌ఇండియా 76,967 ర్యాంక్, మణిశర్మ 468, ఆఫ్రిన్ 430, విజయలక్ష్మి 397, అనురాగ్ 519, అర్చన 406 మార్కులు సాధించారు. రిజర్వేషన్ కేటగిరీల ఆధారంగా ఎంబీబీఎస్, డెంటల్, అగ్రి తదితర కోర్సుల్లో సీట్లు పొందే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అమరచింత: పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు నీట్ ఫలితాల్లో సత్తా చాటారు. పట్టణానికి చెందిన కుర్వ అఖిల 527వ, దేవరకొండ తరుణ్ 467, దిడ్డి శ్రీవర్ధిని 427, వినీత్ 419, కావలి అరవింద్ 411, తెలుగు అక్షయకుమార్ 410, సంగెపాగు నిఖిత 409, ఠాకూర్ నరేన్ 555వ ర్యాంకులను సాధించారు. పట్టణానికి చెందిన పలువురు నీట్ ఫలితాల్లో అమరచింత కీర్తి చాటడం హర్షనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు.

ఆత్మకూర్: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఆత్మకూర్ విద్యార్థి శశికిరణ్ జాతీయస్థాయిలో 650 ర్యాంకును సాధించి సత్తా చాటాడు. పట్టణానికి చెందిన రేణుక, గోవర్ధన్ దంపతుల కుమారుడు శశికిరణ్‌ను స్థానికులు, ఎంవీ రామన్‌స్కూల్ అధినేత డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ అన్సి శ్రీధర్, నిర్వాహకులు అభినందించారు.

వైభవంగా పద్యనాటక ప్రదర్శనలు


శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని ఓ సన్నివేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మున్సిపల్ టౌన్‌హాల్‌లో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పద్యనాటక ప్రదర్శనలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీచంద్రముఖి ఆర్ట్స్ అకాడమీ శేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీకృష్ణ రాయబారం నాటక ప్రదర్శన, అల్లూరి సీతారామారాజు, మాయల పకీరు ఏకపాత్రాభియనయం, శ్రీరామాంజనేయ యుద్ధం ఘట్టం నాటకాలను ప్రదర్శించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళారంగాన్ని బతికించుకోవాలన్న సంకల్పంతో ఏళ్లుగా నాటకాలు ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. తాను సాంస్కృతికశాఖ చేపట్టాక సురవరం ప్రతాపరెడ్డి జీవిత చరిత్రను నాటకంగా వేయించినట్లు వివరించారు. కళాకారులను ఘనంగా సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సిములు, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, శ్రీమిత్ర కళానాట్య మండలి అధ్యక్ష, కార్యదర్శులు వి.మనోహర్‌రెడ్డి, నారాయణ, ప్రభాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి డబ్బుల గోల్‌మాల్

- మున్సిపల్ కమిషనర్‌కు మహిళా సంఘం సభ్యుల ఫిర్యాదు
- ఆర్పీ దండుకున్నాడని ఆందోళన


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళా సంఘం సభ్యులు

అమరచింత: స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న మహిళా సంఘం సభ్యులు చెల్లించిన డబ్బులను బ్యాంక్‌లో జమ చేయకుండా ఆర్పీ స్వాహా చేశాడంటూ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజాకు సభ్యులు బుధవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని శ్రీచైతన్య ఏరియా లెవల్ ఫెడరేషన్ (వీఓ3)లోని జనచైతన్య మహిళా సంఘానికి సంబంధించిన స్త్రీనిధి డబ్బులను వసూలు చేసుకున్న ఆర్పీ రఘు అకౌంట్‌లో జమ చేయకపోవడంతో ఓవర్‌డ్యూ చూపుతుందని సంఘ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మార్చి 2021 నుంచి ఏప్రిల్ 2023 వరకు రెగ్యూలర్‌గా స్త్రీనిధి డబ్బులు రూ.15,642 చెల్లించినా.. సంబంధిత స్త్రీనిధి అకౌంట్‌లో జమ చేయ్యలేదన్నారు. అదేవిధంగా పొదుపు డబ్బులు నెలకు రూ.వంద చొప్పున చెల్లించినవి సైతం జనవరి 2001 నుంచి జనవరి 2023 వరకు రూ.14,400 బ్యాంకు ఖాతాలో జమ చేయలేదని ఆర్పీపై ఫిర్యాదు చేశారని కమిషనర్, మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్ తెలిపారు. అంతే కాకుండా ఇప్పటి వరకు ఆర్పీ రఘు తన సంఘాల పరిధిలో స్త్రీనిధి రుణం పొందిన సభ్యుల ద్వారా వసూలు చేసి ఇప్పటి వరకు రూ.4,29,113 చెల్లించలేదని వివరించారు. ఆర్పీ రఘు వ్యవహారంపై మెప్మా పీడీకి నివేదిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో జనచైతన్య మహిళ సంఘం సభ్యులు కుసల, జ్యోతిబాయి, సంధ్య, సుజాత పాల్గొన్నారు.

అమరచింతలో ఆగని బైక్ చోరీలు

- సీసీ కెమెరాలు ఉన్నా దొంగల చేతివాటం
- పెట్రోల్ అయిపోగానే వదిలి వెళ్తున్న వైనం


అమరచింత ప్రధాన చౌరస్తాలో నామమాత్రంగా ఉన్న సీసీ కెమెరా


నర్వ మండలంలోని పాథర్చేడ్ రహదారిలో దొంగలు వదిలిపెట్టిన టీవీఎస్‌ఎక్స్‌ఎల్

అమరచింత: పట్టణంలో సీసీ కెమెరాలు ఉన్నా గుర్తు తెలియని వ్యక్తులు వరుసగా మోటార్ బైక్‌లను ఎత్తుకెళ్తున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నా పోలీసులు నివారించేందుకు చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేను రోజుల నుంచి ఇప్పటి వరకు ఐదు మోటార్ బైక్‌లను అమరచింత నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే ఎత్తుకెళ్లడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిఘా నేత్రాలను చౌరస్తాలో ఏర్పాటు చేసినా.. వాటిని గమనించకుండా వాహనాలను దొంగిలిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా వీటిని గుర్తుపట్టి చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు సైతం ఇప్పటి వరకు ఎవరా వ్యక్తులు అని గుర్తించలేకపోవడంతో అసలు సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో చోరికి గురైన ద్విచక్ర వాహనాలను దోచుకెళ్లిన వ్యక్తులు వాటిని అమ్మడమో లేదా భద్రపర్చుకోవడమో జరగడం లేదు. దోచుకున్న మోటార్ బైక్‌లను నడుపుకుంటూ వెళ్లిన దొంగలు వాటిలో పెట్రోల్ అయిపోగానే అక్కడే వదిలి వెళ్తున్నారు. ఇలాగే పట్టణానికి చెందిన పోబ్బతి రాముకు చెందిన బైక్‌తో పాటు శ్రీకృష్ణనగర్‌కు చెందిన వ్యక్తి బైక్‌లను నర్వ మండలంలోని యాంకి గ్రామ శివారులో వదిలి వెళ్లారు. నాలుగు రోజుల కిందట ఓ దినపత్రిక విలేఖరి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని నర్వ మండలం పాథర్చేడ్ రహదారిలో వదిలి వెళ్లారు. విషయం తెలుసుకున్న వాహన యాజమానులే ఆయా ప్రదేశాలకు వెళ్లి తమ ద్విచక్ర వాహనాలను తీసుకొస్తున్నారు. పట్టణంలో సీసీ కెమెరాల పరిస్థితి మెరుగ్గా ఉంటే ఇలాంటివి ఎందుకు జరుగుతాయని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ శివ నాగేశ్వర్ నాయుడును ప్రశ్నించగా టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, మోటార్ సైకిళ్ల దొంగల గురించి విచారిస్తున్నామని, త్వరలో పట్టుకుంటామన్నారు.